# దృష్టి

**అది** అమరావతి. అధిపతి అమరేందర్.

అమరేంద్రుడు అపర నలకూబరుడని కొలువులోని వారందరూ ఒప్పుకుంటారు కానీ అతని కారెక్టర్ గురించే కొందరు చిలువలు పలువలుగా చెప్పుకుంటారు. అలా చెప్పుకునే వాళ్ళకేమాత్రం సందు దొరికినా తలోమాట అంటూ తనవితీరా ఆనందిస్తారు. చొరవ తీసుకుని ఎవరన్నా ఆఫీసర్ అమరేందర్ పర్సనల్ అటెండర్ పార్వతీశాన్ని అసలు సంగతేమిటని అడిగితే

"మా ఆఫీసు పంజేస్తుంది ఇంద్రప్రస్తం బిల్డింగులనాయె. దానికి బాసైన మా ఆఫీసరు అందములో చందమామనాయె. వయసు నలభై దాటినా ఇరవయ్యేళ్ల పోరగానోలె జీన్ పాంటేసుకుని పూలరంగనోలె ఉంటరాయె. పూలరంగని చుట్టూ పూబోణులు తిరుగుతుంటారు గదా ! మా ఆఫీసులో పంజేసే ఆడాళ్లలో ఐదారుగురైతే అయ్యగార్ని చిలిపి చూపుల్తో తినేస్తుంటారు. వాళ్ల చూపుల నసలే కాతరు చెయ్యకుండా మా అయ్యగారేమో ఇంకో పిల్ల వెంటబడ్డరాయె... " టూ మినట్స్‌లో టపటపా చెప్పేసి ట్వంటీ రుపీస్ టిప్పు వసూలు చేసి టిప్పు సుల్తానై పోతాడు.

ఆఫీసర్ను మచ్చిక చేసుకుంటే ఖచ్చితంగా మేలే జరుగుతుంది గదా ! పనున్నా లేకున్నా ఏదో ఓ ఫైలును చంకలో ఇరికించుకుని చకచకా చాంబర్లో బొరబడుతున్నారు కొందరు. మాటల మూటలు విప్పి కేకుల్లాంటి జోకులు కట్ చేస్తున్నారు మరికొందరు.

సిర్పూర్ నుండి సిద్దిపేటకు ట్రాన్స్‌ఫర్ మీదొచ్చిన అమరేందర్ ఆఫీసులో జాయినయాక ఐదు రోజులకు –

"ఆఫీసర్ అమరేందర్ గారున్నారా ?"

చాంబర్ ముందుకొచ్చి తీవిగా అడిగిందో మెరుపుతీగ.

టీనేజ్ దాటిందో లేదో... మిలమిలలాడే కళ్లు, మిసమిసలాడే ఒళ్లు, ముద్దు మొహం, చెవులకు దిద్దులు, విల్లుల్లాంటి కనుబొమ్మలు, గులాబిరేకుల్లా నున్నటి బుగ్గలు... నిష్ణాతుడైన శిల్పి ఇష్టపూర్తిగా చెక్కిన శిల్పంలాగుంది. పర్సనల్ అటెండర్ పార్వతీశం కళ్లు అలాగే నిలబడిపోయినై. అందరి చూపులు ఆమె మీద వాలినై.

"మాటలు రావా !" ఆమె కనురెప్పలు తుమ్మెదరెక్కల్లా టపటపలాడినై.

"ఊ... వచ్చండీ, అయ్యగారు లోపలున్నారు" తేరుకుని పక్కకు తప్పుకున్నాడు. ఓ చిరునవ్వు పారేసి లోపలికెళ్ళింది. తలుపులు వాటంతటవే మూసుకున్నై.

అయ్యగారి మాటలు ఆవిడ నవ్వులు అస్పష్టంగా వినబడుతున్నై. పార్వతీశం చూపు లిటున్నా చెవులు అటే వినాలని ప్రయత్నిస్తున్నై. అంతవరకు ఏం మాట్లాడుకున్నారో గాని తాను లోపలికి చాయ తీసుకెళ్లినప్పుడు మాత్రం అయ్యగారు హాపీగా నవ్వుతూ "అవును వసంతా ! మనం రోజూ కలుసుకోవచ్చు" అనడం చెవులారా వినబడింది. కళ్ళారా కనబడింది. అప్పుడు తెలిసిందా వన్నెల విసనకర్ర పేరు వసంత అని.

నెల రోజులు గడిచిపోయినై.

ఆ రోజు... ఆ జంటను హైదరాబాదు బస్సెక్కించి ఒంటరిగా ఆఫీసుకొచ్చాడు పార్వతీశం. ఆఫీసులో ఆఫీసర్ లేనప్పుడు అందరికీ ఆటవిడుపే గదా ! పార్వతీశాన్ని మర్యాదగా పలుకరించాడు హెడ్ క్లర్కు, అంతేకాదు.

"వయసు మీరిన మన అమరేంద్రుల వారి వెంటబడి అంతగా ఆకర్షించిన ఆ ముద్దుగుమ్మ ఎవర్రా ?" ఫైలు పక్కకు నేట్టేసి పళ్లికిలించాడు.

"ఆ కట్టూ, బొట్టూ, జుట్టూ... సూపర్. ఆమె కాలేజి గర్లా, కాలింగ్ గర్లా ?" పెదాలు చప్పరించాడు అకౌంటెంట్.

"ఆ కులుకూ, ఆ పలుకూ అచ్చం అప్సరసలాగుంది. మోడల్ గర్లా..." యాభై దాటిన ఔటువార్డు గుమాస్తా గొంతు పూర్తిగా పెగల్లేదు.

"మోడల్ గర్లో, ముండమోపి గర్లో, నువ్వు కాస్తాగు బాబాయ్ !" ఫైలా పచ్చీసులున్న ఇన్‌వార్డు క్లార్కు కుర్చీలోంచి ఎగిరి టేబుల్ మీద కూచున్నాడు. "ఆవిడ పేరేమిటి ? ఊరేమిటి? ఎక్కడుంటుందీ ? ఏం జేస్తుందీ ?" ప్రశ్నల పరంపర పూర్తి కాలేదు.

రసికుడైన ఆఫీసర్ని కసికసిగా చూస్తూ, ఖాస్ కబుర్లలో ముంచెత్తుతూ అడ్వాన్స్ ఇంక్రిమెంట్లు అదే పనిగా కొట్టెయ్యడములో ఆరితేరిన స్టెనో సంపంగి అతని మాట విరిచేసి "మన సారువారికి ఏ సినిమాలంటే ఇష్టమో, ఏ హీరోయిన్లంటే ప్రాణమో, ఏ ఆటలిష్టమో, ఏ పాటలిష్టమో చెప్పరాదూ !" కాటుక కళ్లను కమ్మగా తిప్పేసింది.

పార్వతీశం పరేశానైపోయాడు. అయినా తెలిసింది చెప్పడం బాధ్యతగా భావించాడు.

"ఆమె పేరు వసంత. అయ్యగారంటే పడిచస్తుంది.. అంతకంటే ఎక్కువ తెల్వదు".

ఉద్యోగములో చేరిన గత పదేళ్లనుండి టైపుమిషన్‌కి అంకితమై ప్రమోషన్ కోసం పాట్లు పడుతున్న తులసికిదంతా గమ్మత్తుగా తోచింది.

"అంతా బాగానే ఉంది గానీ అల్లుని నోట్లోనే శని ఉందన్నట్టు అమరేంద్రుల వారు ముందా అప్సరస వసంత మైకంలోంచి బయటపడితే గాని మరోవైపు గాలి మళ్లదు గదా !" సంపంగి మొహం వాడిపోయిన సన్నజాజిలాగైంది.

దానికేం చెయ్యాలి ? ఎలా ప్రొసీడ్ కావాలి ?

"నాయనా పార్వతీశం ! నువ్వే మా పాలిటి దేవునివనుకో, మాయల ఫకీరు ప్రాణం చిలకలో ఉందన్నట్టుగా మన ఆఫీసర్‌గారి జుట్టు ఎవరి చేతిలో ఉందో చెప్పు" చేతులు పట్టుకు బతిమాలాడు హెడ్‌క్లార్క్.

"ఎందుకు సార్ ?" పార్వతీశం పరకాయించి చూశాడు. దాపరికం లేకుండా విషయమంతా వివరించారు.

"మన ఆఫీసరు వసంతని తీసుకుని హైద్రాబాదుకెళ్లాడు గదా, ఏ లాడ్జింగులో దిగుతారటా?" హెడ్ క్లార్కు మాటల్లో వినయ విధేయతలున్నాయి.

"ఆ టమకుల టమారితో ఎన్ని రోజులు గడిపొస్తారటా ?" సంపంగి సాగదీసింది.

"అందాల బొమ్మగదా, అప్పుడే వదిలిపెడ్తుందా !" తులసి మూతి మూడు వంకర్లు తిరిగింది.

"అట్లా అడుగుతే నేనెట్లా చెప్పాలె ? ఆ సంగతులు నాకేందెల్సూ ?"

"హమ్మా ... వీనికెంత టెక్కో" సంపంగి చెవిలో కుతకుతలాడింది తులసి.

"ఏం చేద్దాం ? అవసరం మనది. వసుదేవుడంతటి వాడు ఆనాడు గాడిద కాళ్లు పట్టుకున్నాడటా..." చెవిలోనే జవాబిచ్చింది.

ఇద్దరి వాలకం కనిపెట్టి కళ్లతో ఏదో చెప్పాడు హెడ్ క్లార్క్. ముగ్గురు కలిసి కంబైన్డ్‌గా బ్రతిమాలారు.

పాపమనిపించింది పార్వతీశానికి.

"మీక్కావల్సింది వాళ్లిద్దరి కనెక్షన్ కట్ కావడమే గదా !" హీరో చిరంజీవిలా ఫోజిచ్చాడు.

"అవునవును" మూడు గొంతులొకేసారి.

"అయితే ఓ పంచేద్దాం"

"ఏమిటదీ ?"

"మనయ్యగారికి భారత్‌నగర్లో బ్రహ్మాండమైన బంగళా అద్దెకు దొరిగింది. హైద్రాబాదు నుండి వాళ్లింటికెళ్లి అమ్మగార్ని.. అంటే వాళ్ల భార్యను తీసుకొస్తామన్నారు. ఆవిడ రాగానే మనము వాళ్లింటికెళ్లి అమ్మగారిని మర్యాదపూర్వకంగా కలిసి అసలు సంగతి ఆవిడ చెవిలో వేద్దాం"

"అయ్యగారు అగ్గిమీద గుగ్గిలమై పోరా ?"

"అయితే కానీ. కాస్సేపు అరుస్తాడంతే కదా..."

"వారెవ్వా !" సంపంగి ఎదలో సంతోషతరంగమెగసిపడింది. "అప్పుడిహ కావల్సి కార్యం గంధర్వులే తీరుస్తారు".

* * *

భారత్‌నగర్ బస్తీలో అధునాతనమైన బంగళా. లారీలోంచి సామానులు దించి ఎక్కడివక్కడ సర్దేసరికి అమరేందర్‌కు తలప్రాణం తోకకొచ్చింది. అంతా అయాక హాయిగా నిద్రబట్టింది.

ఆదివారం.... ఉదయం ... పొద్దు బారెడెక్కింది, ఆఫీసు స్టాఫు ఇంట్లో ప్రత్యక్షమయ్యే సరికి సంభ్రమాశ్చర్యాలలో మునకవేశాడు.

"వెల్‌కం... రండి, రండి..." పైకైతే స్వాగతం పలికాడు కాని లోపల తొలుస్తూనే ఉంది. తనను మరో ఊరు ట్రాన్స్‌ఫర్ చేసినట్టు పై నుండి వార్త ఏమీ రాలేదు గదా ! విజిలెన్స్ ఆఫీసర్లెవరన్నా ఆఫీసు ఇన్స్‌పెక్షన్‌కొచ్చి గొడవ చేయలేదు గదా ! వీళ్లంతా కావాలనే కట్టగట్టుకుని వచ్చి తిరగబడ్డంలేదు గదా ! ఎందుకైనా మంచిదని వంటింట్లో కెళ్లి అందరికీ చాయలు పట్రమ్మని ఆర్డరేశాడు. సాయంకోసం పార్వతీశాన్ని వెళ్లమన్నాడు. అంతవరదాకా పులిలాగున్న పార్వతీశం పిల్లిపిల్లలా తలవంచుకుని వంటింట్లో కెళ్లాడు.

"ఇల్లు బాగుంది. ఈ రోజుల్లో ఇలాంటి అద్దె ఇల్లు దొరకడం అదృష్టం సార్ !" కాంప్లిమెంటిచ్చి కామ్‌గా కూచున్నాడు హెడ్ క్లార్క్, చూపులు పై కప్పుకు వెళ్లాడుతున్నై.

"మనాఫీసర్‌గారి టేస్టుకు తగినట్టుగా ఉంది." కొంటెగా నవ్వబోయి కొంగు సవరించుకుంది సంపంగి. గోడకు వేలాడదీసిన బొమ్మల్ని చూస్తూ తులసి పక్కన కూచుంది.

కాస్సేపు పట్టణాల్లో అద్దె ఇళ్ల గురించీ, ఓనర్ల పెత్తనం గురించీ పిచ్చాపాటీ చర్చసాగింది. ఆ తర్వాత

"ఇల్లు చూడు ఇల్లాలిని చూడమన్నారు గదా సార్" తులసి పెదాల మీదికి చిరునవ్వు తోసుకువచ్చింది.

"మీ శ్రీమతి గార్ని, పిల్లల్ని పరిచయం చేసుకోవాలని వచ్చాం సార్" సోఫాలో ముడుచుకు పోయాడు ఔటువార్డు గుమాస్తా. ఈ వయసులోనన్నా చిన్నపాటి ప్రమోషనొస్తే బాగుండనే ఆలోచన ఈ మధ్య కలిగిందతనికి.

హమ్మయ్య అంతేకదా ! తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు అమరేందర్.

కాలి అందెల సవ్వడి చెవులకింపుగా వినబడింది. అందరి చూపులటు తిరిగినై. చాయ ట్రేతో అడుగులో అడుగేస్తూ వస్తోంది వసంత. తలస్నానం చేసిందేమో - కురులు విడిపోయి ఉన్నాయి. నుదుట కుంకుమబొట్టు...

ఆఫీసు స్టాఫు మొహాల్లో రంగులు మారాయి.

ఓర్నీ... ఈమెనే ఇతని ఇల్లాలా ! ఔటువార్డు గుమాస్తా మనసు ఇన్‌వార్డుగా మూల్గింది.

హారిభడవా ! నడివయసు ముండావాడికి గజ్జెల గుర్రంలాంటి పెళ్ళామా ! ఏం

సుఖపడ్తుందీ పాపం ! పైలాపచ్చీసు పరితపించి పోయాడు.

ఏవిటో... ఆడవాళ్ల మెడలో... లోపల మంగళసూత్రాలు పైన ఒంటిపేట గొలుసు. పెళ్లైన వారెవరో, కానివారెవరో కనుక్కోవడం కష్టమైపోయింది. హెడ్‌క్లార్క్ గొణుగుడు పెదాలు దాటలేదు.

ఉలుకూపలుకూ లేకుండా కూచున్నవాళ్లను తమాషాగా చూస్తూ తలా ఓ చాయ కప్పు అందిస్తోంది వసంత. షాక్ నుండి తేరుకుంటూ చాయ సేవిస్తున్నారంతా.

"ఈమె వసంత. నా కూతురు. ఏకైక సంతానము" అమరేందర్ అందుకున్నాడు. "ఈ సిద్దిపేటలోనే ఎం.బి.ఏ. చదువుతోంది. పీ.జీ. హాస్టల్లో ఉంటుండేది మొన్నటిదాకా. యం.బి.ఏ. పూర్తవగానే పెళ్లి చేయాలనుకుంటున్నాను" కూతుర్ని పరిచయం చేశాడు.

"మీ అమ్మ లోపలేం జేస్తుందీ ? ఓసారిటు తీసుకురామ్మా !" వసంతను పురమాయించాడు.

**14-11-2001**
**'ప్రియదత్త' సకుటుంబ వారపత్రిక**
**దీపావళి ప్రత్యేక సంచికలో**
**ప్రచురితమైంది.**

